క్లుప్తంగా

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు

విజయపురం (నగరి): మండలకేంద్రంలోని విజయపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య సోమవారం విద్యాసామగ్రిని వితరణ చేశారు. ఉపాధ్యాయులు పురుషోత్తం, ఆనందరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. దాతలు అందించే సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, బాగా చదువుకోవాలని, క్రమశిక్షణతో నడుచుకోవాలని దాత చంద్రయ్య సూచించారు.

నేడు వాహనాల వేలం

నగరి: సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన ఒక ఫోర్డ్ కారు, మోటార్ సైకిల్‌ను మంగళవారం వేలం వేయనున్నట్లు సీఐ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఈ వాహనాలకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు వేలం పాట నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల వారు మంగళవారం ఉదయం 10.30 గంటలకు నగరి పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకరరావు

వెదురుకుప్పం: ప్రజా సమస్యల పరిష్కారం చేయడంలో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సుధాకరరావు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు వారి పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ నెల 27న జరగనున్న స్పందన కార్యక్రమంలో అంతా పాల్గొనాలని, జిల్లాస్థాయి అధికారులు హాజరు కానున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యకు తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు సువర్ణావకాశం

వెదురుకుప్పం: ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వం సువర్ణావకాశాన్ని కల్పించినట్లు చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నిర్మలాకుమారి సోమవారం ఒప్రకటనలో తెలిపారు. 2023 మే నెలలో జరిగిన పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు, అంతకుముందు పరీక్షల్లో తప్పిన విద్యార్థులు అక్టోబర్ 3వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించి తరగతులకు హాజరు కావచ్చన్నారు. భవిష్యత్‌లో ఇంటర్ విద్యార్థులు మంచి ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

బీజేపీ నేతల అన్నదానం



అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

పాలసముద్రం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు రాజేష్ కుమార్, గంగాధరనెల్లూరు ఇన్‌చార్జ్ రాజేంద్ర తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుమారు వందమందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మురుగదాస్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు కుప్పమ్మ, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ సిబ్బందికి వస్త్ర బహుమానం

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, వాహనం బేరర్లు, మేళం సిబ్బందికి సోమవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వస్త్ర బహుమానం అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి చేతులమీదుగా వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నట్టు చెప్పారు.

పక్కాగా ఈ-క్రాప్

పంట నష్ట సమయంలో ప్రతి రైతుకు రాయితీ అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఈక్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశించింది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. అయితే ఈ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కొత్త పద్ధతి ప్రవేశపెట్టింది. ఈ-కర్షక్ యాప్‌లో కొత్త మాడ్యూల్‌ను రూపొందించింది. దీంతో అన్ని రకాల పంటల వివరాలను నమోదు చేయడంతో పాటు పక్కాగా వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంటుంది.

- పక్కా ప్రణాళికతో ఈ-క్రాపింగ్ బుకింగ్
- వ్యవసాయ సహాయకుల ట్యాబ్‌లలో ఈ-కర్షక్ యాప్‌తో పాటు జియోఫెన్సింగ్ అనుసంధానం
- క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది
- ఈ నెల 30తో పూర్తవనున్న గడువు



పొలాల్లోనే ఈ క్రాపింగ్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

విజయపురం (నగరి): నియోజకవర్గంలో పక్కా ప్రణాళికతో ఈ-క్రాప్ బుకింగ్ జరుగుతోంది. నగరి, విజయపురం, నింద్ర మండలాల్లో మొత్తం 14,580 ఎకరాల్లో రైతులు వ్యవసాయ, ఉద్యానశాఖల పరిధిలో వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో ఇప్పటి వరకు 12,560 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశారు. ఈ నెల 30వ తేదీతో వ్యవసాయ శాఖ పరిధిలో పంటలకు ఈ-క్రాప్ నమోదుకు గడువు పూర్తవుతుంది. ఆలోపు రైతులంతా ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు.

గతంలో ఇలా ఉండేవి..

గతంలో ఏయే సర్వే నంబర్లలో రైతులు ఏ పంటలు సాగు చేస్తున్నారో వ్యవసాయ విస్తరణాధికారి ఆధ్వర్యంలో సిబ్బంది నమోదు చేస్తారు. తరువాత ఆ నివేదికను ప్రభుత్వానికి పంపేవారు. అలాగే గ్రామంలోని పెద్దరైతుల నుంచి సమాచారం తీసుకోవడం, లేదా రైతులు చెప్పింది నమోదు చేసేవారు. దీంతో వివిధ రకాల పంటలు ఏ మేరకు సాగవుతున్నాయో పూర్తిస్థాయిలో స్పష్టత ఉండేది కాదు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పంటల నమోదుకు సంబంధించి సరికొత్త కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. గ్రామ వ్యవసాయ సహాయకుల ట్యాబ్‌లలో కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేసి, దాని సహాయంతో ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. దీంతో గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుంది.

జియోఫెన్సింగ్ అనుసంధానం..

గ్రామ వ్యవసాయ సహాయకుల ట్యాబ్‌లలో ఈ-కర్షక్ యాప్‌తో పాటు జియోఫెన్సింగ్ అనుసంధానమై ఉంటుంది. ఇప్పటివరకు ఉపయోగిస్తున్న ట్యాబ్‌లో అటెండెన్స్‌తో పాటు రోజువారీ విధుల వివరాలు, రైతు బీమా, రైతుబంధు తదితర వాటిని అప్‌డేట్ చేసేవారు. ఇందులోనే ఈ-క్రాప్ బుకింగ్ చేసేవారు. దీంతో క్షేత్రస్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. వీటికి చెక్ పెడుతూ ప్రభుత్వం ఈ కర్షక్ యాప్‌లో కొత్త మార్పులు చేపట్టింది. సంబంధిత సర్వే నంబర్ పొలానికి వెళ్లినప్పుడు మాత్రమే వివరాలు కనిపించేలా మాడ్యూల్ రూపొందించింది. సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు గూగుల్ జియోఫెన్సింగ్ ద్వారా ఆ లొకేషన్‌కు చేరుకుంటారు. 200 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు మాత్రమే సర్వే నంబర్ వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. ఇలా చేయడంతో రాష్ట్రప్రభుత్వం అందించే రాయితీలు, సంక్షేమాలు అర్హులైన రైతులకు సక్రమంగా అందుతాయి.

పక్కా సమాచారం..



ఈ-కర్షక్ మొబైల్ యాప్‌లో జియోఫెన్సింగ్ డౌన్‌లోడ్ చేసుకుని, పంట వివరాలను నమోదు చేసుకునే ప్రక్రియను ప్రారంభించాం. నూతన విధానంలో పంటల నమోదు సమాచారం పక్కాగా ఉంటుంది. దీని ద్వారా దిగుబడి ఎంత వస్తుందనే అంశం కచ్చితంగా ప్రభుత్వానికి తెలుస్తుంది. తద్వారా ప్రభుత్వం పంటల కొనుగోలు, ఇతర అంశాలకు ఈ వివరాలు ఉపయోగపడతాయి.

–రాఘవేంద్ర, నగరి ఏఓ

ఈ నెల 30కి గడువు పూర్తి



మండలంలో 95 శాతం ఈ-క్రాప్ బుకింగ్ చేపట్టాం. ఈ నెల 30న ఈ క్రాప్ బుకింగ్ గడువు పూర్తవుతుంది. అలాగే ఈకేవైసీ చేసుకోని రైతులు త్వరగా చేసుకోవాలి. ఈ-క్రాప్ కొత్త విధానంలో క్షేత్రస్థాయికి వెళ్లి నమోదు ప్రక్రియను చేపడుతున్నాం. రైతు ఫొటో తీసి, పంట నమోదును చేపట్టడంతో పంటలు సమాచారం పూర్తిస్థాయిలో నమోదవుతుంది. ఇలా చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీలు, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో రైతులకు అందుతాయి.

–రజినికుమారి, విజయపురం, ఏఓ

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

నగరి: స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు యాంటీర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం హాస్టల్‌కు వెళ్లిన న్యాయవాదులు మహదేవన్, తిరుమల విద్యార్థులకు ర్యాగింగ్ చేయడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే విధించే శిక్షల గురించి తెలియజేశారు. ఉన్నత విద్యను ఆర్జించడానికి వెళ్లిన సమయంలో ర్యాగింగ్‌కు పాల్పడకూడదని విద్యార్థులకు తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

నగరి: మండలంలోని తడుకుపేట గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బస్టాండు సమీపంలో, తడుకు వెళ్లే మలుపు వద్ద జాతీయ రహదారిపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఆర్డీఓ సుజనకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం వారు ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో విన్నవించారు. విద్యార్థులు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా రోడ్డు దాటుతుంటారని, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తే వారికి ఉపయోగంగా ఉంటుందన్నారు.

నాడు సైలెంట్‌గా ఉండి నేడు విమర్శలా ?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నింద్ర: నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతులకు చెల్లించాలసిన బకాయిలపై నాడు ప్రేక్షకపాత్ర వహించి నేడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మట్లాడుతూ నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు 2018–19లో రైతుల దగ్గర నుంచి చెరుకు సరఫరా చేసుకుని రూ.36 కోట్ల చెల్లించాల్సి ఉందన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉందని, మరి జనసేన నాయకులు ఆరోజు ఏమీ ఎరగనట్లు ఉండి నేడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. ఇప్పటికే ఫ్యాక్టరీ యాజమాన్యానికి ప్రభుత్వం వచ్చే నెల 7వ తేదీ వరకు గడువు ఇచ్చిందన్నారు. ఆపై ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, మండల కన్వీనర్ వేణురాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, నాయకులు శివలింగారెడ్డి, రాము, శివయ్య, ఏలుమలై, వీరయ్య పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



ఆలయం వద్ద అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

నగరి: మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు దామరపాకం మిట్టిండ్లుకు చెందిన దొరస్వామినాయుడు అనే దాత అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చేతివృత్తులపై అవగాహన



మహిళలకు చేతివృత్తులపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్లు

పాలసముద్రం: మహిళలు చేతివృత్తులు నేర్చుకుని తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని రూరల్ యాక్షన్ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ చిట్టిబాబు తెలిపారు. సోమవారం వీర్లగుడి దళితవాడలో కోయిర్ బోర్డు వారి ఆధ్వర్యంలో మహిళలకు స్పిన్నింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తుల ద్వారా మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. 2 నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, చేతివృత్తుల ద్వారా మరింత సాధ్యమన్నారు. అనంతరం కొబ్బరిపీచుతో దారాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు సంస్థల సభ్యులు రవి, భూపతి, రిటైర్డ్ టీచర్ ఆర్ముగం, ట్రైనర్లు లిల్లీ, రేఖ పాల్గొన్నారు.

స్పందన వినతులపై దృష్టి పెట్టండి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం: స్పందనలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 05, శ్మశానానికి దారి 01, డీకేటీ పట్టా కేటాయించాలని 03, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 02, వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 04, ఇతరుల ఆక్రమణలో ఉన్న భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01, ఇంటి స్థలం కోసం 03 వినతులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనకు వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.

బహిరంగ సామాజిక తనిఖీ రేపు

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో బుధవారం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం బహిరంగ సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 మార్చి వరకు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 23 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల కేంద్రంలో ప్రజావేదిక జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొనాలని కోరారు.

హాని కలిగించే ప్రాంతాల్లో క్వారీలు వద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు



సీఐకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

నగరి: ప్రజలకు హాని కలిగించే ప్రాంతాల్లో క్వారీలకు అనుమతులు ఇవ్వవద్దని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి, అలాంటివారిపై చర్యలు చేపట్టాలంటూ సీఐ సురేష్‌కు అడవికొత్తూరు, అడవికండ్రిగ గ్రామాలకు చెందిన వారు వినతిపత్రం అందజేశారు. సోమవారం తహసీల్దార్, సీఐలను అధిక సంఖ్యలో గ్రామస్తులు కలిసి వచ్చి వారితో మాట్లాడారు. ప్రభుత్వానికి తప్పుడు సమాచారం అందించిన కొందరు క్వారీ నిర్వాహకులు ప్రజలు నివశించే ప్రాంతంలో సర్వే నంబరు 285/1, 2లలోని కొండల వద్ద క్వారీ నడపాలని చూస్తున్నారన్నారు. గతంలో ఇలాంటి క్వారీల కారణంగా గ్రామాల్లో ఇళ్లు కూలి మరణాలు సంభవించిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. అలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. క్వారీల ఏర్పాటుకు ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతులు ఇవ్వకూడదన్నారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ క్వారీ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలను తాను ప్రత్యక్షంగా పరిశీలిస్తానన్నారు. ప్రజలకు హానికలిగించే ఎలాంటి పనులకు తాము అనుమతులు ఇవ్వమని తేల్చిచెప్పారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయపురం (నగరి): రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని, ఇది ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని పార్టీ మండల కన్వీనర్ గోపినాథ్ తెలిపారు. సోమవారం పన్నూరులోని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అందించిందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల పిళ్లారిపట్టు తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అలాగే ఈ నెల 100కు పైగా కొత్త పింఛన్లు ఇచ్చామని, ఇది ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు తప్పుడు విమర్శలు చేస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజగోపాల్, మండల కో–ఆప్షన్ మెంబర్ రాజేంద్రన్, ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజలకు టోకెన్ అందిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం దళితవాడలో గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సిబ్బంది చేస్తున్న ఇంటింటా సర్వేని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటా సర్వే ద్వారా గ్రామంలో వైద్యపరీక్షలు చేసి టోకన్లు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రజలకు 8 రకాల పరీక్షలు చేశారు. అనంతరం టోకెన్లను ఎంపీడీఓ, సర్పంచ్ గాలి మహేష్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యశ్వంత్, ఏఎస్ఎం రేవతి, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన విజయ్‌కుమార్

గంగాధరనెల్లూరు: గణపతి విగ్రహం ఏర్పాటు చేసేందుకు నిర్మించిన మండపంలో విద్యుత్ అలంకరణ చేస్తున్న ఓ యువకుడికి కరెంట్ షాక్ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఇరగమరెడ్డి కండ్రిగ గ్రామంలో సోమవారం వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే అక్కడ మండపానికి విద్యుత్ అలంకరణ చేస్తుండగా విజయ్‌కుమార్‌కు షాక్ తగిలింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఉమామహేశ్వరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


ఆర్‌బీకేల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ

కార్వేటినగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రైతులకు అందాలంటే ఈ-క్రాప్‌తో పాటు ఈకేవైసీ నమోదు తప్పనిసరి అని ఏఓ హేమలత అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నూరు, కొల్లాగుంట, గోపిశెట్టిపల్లి రైతు భరోసా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. అలాగే సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదును ఈ నెల 30లోపు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎరువులు, విత్తనాలపై ప్రజలకు అవగాహన కల్పించి దళారుల ద్వారా రైతులు మోసపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



గార్మెంట్‌లో పనులను పరిశీలిస్తున్న మహిళలు

పుత్తూరు రూరల్: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మహిళలకు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణతో ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక దక్షిత గార్మెంట్ అధినేత మోహనకృష్ణ సూచించారు. టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న 40 మంది మహిళలు సోమవారం గార్మెంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించేందుకు రాస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంస్థ అభ్యర్థన మేరకు తమ గార్మెంట్స్‌లో ఇప్పటికే 15 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మరింత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహాలతో పాటు రుణాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ హేమవతి, రాస్ అధికారులు రవి, జయంతి పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ఆయుష్మాన్‌భవ ధ్యేయం



ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని హెల్త్‌కమిటీ మెంబర్ రామయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రెండవ దఫా ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ గీతా కుమారి మాట్లాడుతూ ఆయుష్మాన్‌భవ కార్యక్రమం ద్వారా ప్రసవ సంబంధిత ప్రత్యేక వైద్యాధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే చిన్నపిల్లల వైద్యులు, శస్త్రచికిత్స నిపుణులు, అదేవిధంగా చెవి, ముక్కు, గొంతు సమస్యలకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యతీశ్వర్‌నాయుడు, కొర్రా రాఘవులు, డాక్టర్ సంధ్య, పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపమే ఎన్‌ఎస్‌ఎస్





మాట్లాడుతున్న జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: సేవా దృక్పథానికి ప్రతిరూపమే నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్) అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ‘కళాశాల నుంచి సమాజంలోకి’ అనేది ఎన్‌ఎస్‌ఎస్ నినాదమని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్‌లో విద్యార్థులు చేరడం ద్వారా సమాజ సేవ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. చదువుతో పాటు సమాజసేవ తమ బాధ్యతగా ప్రతి విద్యార్థి భావించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడాశాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శ్రీనివాసులు, రఘురామన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో..

స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజం పట్ల సేవా గుణం కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో ఎన్‌ఎస్‌ఎస్‌ను తొలి వేదికగా స్వీకరించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ జయప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘భక్తిగీత శ్రీపుత్రుడు’గా గాలి గుణశేఖర్



తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎస్ రవి చేతుల మీదుగా బిరుదును స్వీకరిస్తున్న డాక్టర్ గుణశేఖర్

పుత్తూరు రూరల్: శైవమత సిద్ధాంత సంపుటాల్లోని 10వ తిరుముర్తైలో 3 వేల తమిళ గీతాలను తెలుగులోకి అనువదించిన తిరుపతికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ గాలి గుణశేఖర్‌కు తమిళనాడు ప్రభుత్వం గవర్నర్ ఆర్.ఎస్.రవి చేతుల మీదుగా ‘తిరుముర్తై తిరుమగన్’ (భక్తిగీత శ్రీపుత్రుడు) బిరుదును ప్రదానం చేసింది. గత శనివారం తమిళనాడు గవర్నర్ బంగ్లాలోని భారతియార్ మంటపంలో జరిగిన కార్యక్రమంలో గుణశేఖర్‌కు బిరుదును ప్రదానం చేయడంతో పాటు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన శ్రీవాణి, కలలు కల్పనలు, నారాయణ మంత్రం, తిరుమందిరం అనే అనువాద గంథ్రాల గురించి ప్రస్తావించి కొనియాడారు.